ఆకట్టుకున్న సిక్కుల విన్యాసాలు

చిలకలగూడ: సిక్కు మత గురువు తేజ్‌బహదూర్ సాహెబ్ 349వ బలిదానం సందర్భంగా సీతాఫల్ మండి గురుద్వారా ప్రబంధక్ కమిటీ నేతృత్వంలో చిలకలగూడ మున్సిపల్ మైదానంలో ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. పంజాబ్,అమృత్‌సర్‌లకు చెందిన పలువురు ఆధ్యాత్మికవేత్తలు ఆలపించిన విశాల్ కీర్తన దర్బార్, నగర సంకీర్తన, సిక్కువీరుల విన్యాసాలు అలరించాయి. గురు కా లాంగర్ పేరిట అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నగరం నలుమూలల నుంచి సిక్కు మతస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రబంధక్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్‌సింగ్ ఓషహాన్, రంజిత్‌సింగ్, సేవాదార్ జస్విందర్‌సింగ్,హర్ప్రీత్‌సింగ్ తదితరులు నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కీర్తనలు ఆలపిస్తున్న సిక్కు ఆధ్యాత్మికవేత్తలు


కరవాలంతో ర్యాలీ ..


విన్యాసాలు చేస్తున్న దృశ్యం

విధుల్లో చేరిన గ్రూప్-4 ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీపీఎస్సీ ద్వారా కొత్తగా ఎంపికైన గ్రూప్-4 ఉద్యోగులు ఓయూలో రిపోర్టు చేస్తున్నారు. యూనివర్సిటీ మొత్తానికి 375 మంది ఉద్యోగులను కేటాయించగా ఇంత వరకు 127 మంది రిపోర్టు చేశారు. ఓయూ చరిత్రలో తొలిసారి టీజీపీఎస్సీ ద్వారా నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేస్తున్నారు. గతంలో వర్సిటీలో తాత్కాలికంగా పని చేసే వారి సీనియర్టీని బట్టి పర్మనెంట్ చేశారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వత వర్సిటీ నియామకాలను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం టీజీపీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే ఈ ఉద్యోగులు వచ్చినంత మాత్రన ఓయూలో గత 27 ఏండ్లు సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించబోమని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ కాలేజీలు నిజాం కాలేజీ, సైఫాబాద్ పీజీ కాలేజీ, సికింద్రాబాద్ పీజీ కాలేజీలు, జిల్లా పీజీ సెంటర్లకు గ్రూప్-4 ఉద్యోగులకు పోస్టింగులు ఇవ్వనున్నారు. ఓయూలో చేరే ఉద్యోగులలో ఎగ్జామినేషన్ బ్రాంచ్‌కు అధికంగా 50 మందిని నియమించనున్నారు. ఇతర కార్యాలయాలు, కళాశాలలకు అవసరాలను బట్టి 10 నుంచి 15 వరకు గ్రూప్-4 ఉద్యోగులను కేటాయించనున్నారు.

మూడు రోజుల పాటు విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలు


దేవాలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయ విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం ఆయన దేవాలయాన్ని సందర్శించి పునః ప్రతిష్ఠ కార్యక్రమ ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు. ఇటీవల దుండగుడు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో సుమారు రూ.30లక్షల వ్యయంతో దేవదాయ శాఖ నుంచి దేవాలయాన్ని పునర్నించడంతో పాటు అమ్మవారి పంచ లోహ విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించినట్లు చెప్పారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

11వ తేదీ బుధవారం 8.33 నిమిషాలకు పునః ప్రతిష్ఠ కార్యక్రమం వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

అరిగపూడి విజయ్‌కుమార్‌కు ఘన నివాళి

బంజారాహిల్స్: ప్రముఖ సంఘ సంస్కర్త, కేబీఆర్ పార్కు నేచర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరిగపూడి విజయ్‌కుమార్ సంస్మరణ సభ జూబ్లీహిల్స్‌లోని కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. పలువురు రాజకీయ నేతలతో పాటు సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, వాకర్లు తరలివచ్చి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్‌రావు

ఆకట్టుకున్న భక్త మార్కండేయ హరికథా గానం

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో శనివారం సాయంత్రం శ్రీమదజ్జాడ నారాయణ దాస వర్యుల 160వ, నేతి లక్ష్మీనారాయణ భాగవతులు 126వ జయంతి హరికథ మహోత్సవాలు నేత్ర పర్వంగా కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో రెండో రోజైన ఆదివారం సాయంత్రం జి. మునిలక్ష్మి భాగవతారిణి 'భక్త మార్కండేయ'హరికథా గానం ఆకట్టుకుంది. దీనికి వయోలిన్‌పై దక్షిణామూర్తి, బి. శ్రీపతి రావు, మృదంగంపై సుధాకర్, తబలాపై నటరాజ్ వాద్య సహకారమందించారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ముషీరాబాద్: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు డి.వెంకటేష్, జెనిగే శ్రీనివాస్‌యాదవ్, సురేష్‌కుమార్, లింగంగుప్తా పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్‌లో ప్రజాపాలన విజయోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కోట నీలిమ

బన్సీలాల్‌పేట్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన పట్ల ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. ఆదివారం రాత్రి బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్ కమ్యూనిటీహాల్‌లో డివిజన్ అధ్యక్షులు ఐ. చిరంజీవి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన విజయోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంవత్సర కాలంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. లక్షలాది మంది పేద కుటుంబాలు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా కరెంట్, గ్యాస్ కనెక్షన్లు పొందుతున్నారని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా...సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పేద వర్గాలు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందేలా చూడాలన్నారు. అంతకు ముందు బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలేసి చాచానెహ్రూనగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఉజ్మా షకీర్ జీ, నాయకులు శ్రావణ్ కుమార్, ఆశీష్, నసీమా బేగం, చిరంజీవి, మల్లం రమేష్, గంటా సుధీర్, రమేష్ బాబు, కరీం, పాండు, శ్రీనివాస్, నారాయణ, సీపీ శంకర్, డాక్టర్ శివ కుమార్ లాల్, శ్రీహరి, జగదీష్, మహేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్లెక్కలేం బాబోయ్..!

గాంధీ వైద్య కళాశాలలో పనిచేయని లిఫ్టులు

- నాలుగు అంతస్తులు ఎక్కిదిగేందుకు మెడికోల ఇబ్బందులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సీనియర్ వైద్యులు
- పట్టించుకోని నిర్వహణాధికారులు


గాంధీ మెడికల్ కాలేజీలో పనిచేయని లిఫ్టులు

గాంధీఆస్పత్రి: దేశవిదేశాలకు నిష్ణాతులైన వైద్యులను అందించిన సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో గత కొన్నినెలలుగా లిఫ్టులు మొరాయించడంతో సీనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నాలుగు అంతస్తుల గాంధీ కళాశాల భవనంలో మైక్రోబయోలజీ, ఫిజియాలజీ, పాథాలజీ, బయోకెమిస్ట్రీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఎలక్ట్రానిక్ లైబ్రరీలతోపాటు పలు వైద్య విభాగాలు కొనసాగుతున్నాయి. 1250 మంది వైద్యవిద్యార్థులు, 450కి పైగా వైద్యులు, జూనియర్ డాక్టర్లు, హౌస్‌సర్జన్లు, మరో 250 మందితోపాటు, ఫోరెన్సిక్ విభాగానికి నగరంలోని పలు పోలీస్ ఠాణాల సిబ్బంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు 20 శాతం మంది సీనియర్ వైద్యుల వయసు 60 ఏళ్లు దాటింది. వీరితోపాటు దివ్యాంగులు, ఇతర రుగ్మతలతో బాధపడే ఉద్యోగులు నాలుగు అంతస్తులు ఎక్కి దిగలేక అపసోపాలు పడుతున్నారు. నాలుగు అంతస్తుల భవన సముదాయంలో కేవలం రెండు లిఫ్టులు మాత్రమే ఏర్పాటు చేయగా, ఒక లిఫ్ట్ ఏడాది క్రితం పాడవగా, రెండవది మూడు నెలల క్రితం మొరాయించింది. అప్పటి నుంచి వైద్యులు, సిబ్బంది ఆయా అంతస్తులకు వెళ్లేందుకు మెట్లు ఎక్కి దిగలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మెట్లు ఎక్కలేని మరికొంతమంది గ్రౌండ్ ఫ్లోర్‌లోనే కూర్చుని, అక్కడి నుంచే తమ పనులను చక్కబెడుతున్నారని, మెట్లు ఎక్కేసమయంలో ఆయాసానికి గురై ఆస్పత్రి పాలవుతున్నారని ఓ సీనియర్ వైద్యుడు వాపోయారు. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన కళాశాల భవనంలోని లిఫ్ట్‌ల కాల పరిమితి ముగిసిందని, బకాయిలు చెల్లించకపోవడంతో నిర్వహణ సంస్థ మరమ్మత్తులు చేయడం లేదని తెలిసింది. తక్షణమే కళాశాల పాలనయంత్రాంగం, తెలంగాణ వైద్యవిద్య మౌళిక సదుపాయాల కల్పన సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) అధికారులు స్పందించి మరమ్మత్తులు చేయించి లిఫ్ట్‌లను అందుబాటులోకి తేవాలని, ఆధునిక నూతన లిఫ్ట్‌లు ఏర్పాటు చేయాలని పలువురు వైద్యులు, వైద్యవిద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై వివరణ కోరేందుకు ప్రయత్నించగా కళాశాల ప్రిన్సిపాల్ అందుబాటులో లేరు. గాంధీ మెడికల్ కాలేజీలో పనిచేయని లిఫ్ట్‌ల పరిస్థితిని వైద్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఓ సీనియర్ వైద్యుడు తెలిపారు.

వైభవంగా సహస్ర కలశాభిషేకం

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వామికి ఆదివారం సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి హోమం అనంతరం 108 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. సుగంధ ద్రవ్యాలు నింపిన కలశాలతో అయ్యప్ప మూల విరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం అయ్యప్ప స్వామి భస్మ చందన అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం పడిపూజ, పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాస శర్మ, రామకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి శిబిరాల ఏర్పాటు

బంజారాహిల్స్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జలమండలి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్‌రోడ్డు, ట్యాంక్‌బండ్‌లో దాదాపు 45 చోట్ల ఉచిత తాగునీటి శిబిరాలు ఏర్పాటుచేశారు. జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్ ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు శిబిరాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఒక్క రోజే 5 లక్షలకు పైగా తాగునీటి ప్యాకెట్లను పంపిణీ చేశామని తెలిపారు. సోమవారం శిబిరాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

భగవద్గీత శ్లోక పఠన పోటీలు

నల్లకుంట: గీతా జయంతిని పురస్కరించుకొని వివేకానంద కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట శంకరమఠంలో ధారణ శిబిరం విద్యార్థులకు భగవద్గీత శ్లోక పఠనంపై పోటీలు నిర్వహించారు. చిన్నారులు ఎంతో చక్కగా శ్లోకాలు పఠించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న 50 మంది విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు, ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద కేంద్రం బాగ్‌లింగంపల్లి శాఖ ఇన్‌చార్జ్ రంగాచార్యులు, సదానంద్‌ఖాకడే, రామలింగేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, భూదాన్ సాగర్‌రెడ్డి, విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.4500 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి

కాచిగూడ: విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.4500 కోట్లు వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఫీజుల బకాయిలు విడుదల చేయాలని కోరుతూ లేఖ రాసినట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు కమిషన్ల కోసం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారే తప్ప ఎంతో ఉజ్వలమైన భవిష్యత్ ఉన్న భావిభారత పౌరులు చదువుకునే విద్య ఫీజుల బకాయిలు మాత్రం చెల్లించడం లేదన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని కోరారు. ఈనెల 10వ తేదీన జరిగే జిల్లా కలెక్టరేట్లు, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్: ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురా నగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌కాలనీలో నివసించే కే వెంకటేశ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 6న రాత్రి విధులు ముగించుకుని తన బైక్‌ను ఇంటి ఎదుట పార్క్ చేశాడు. ఉదయం లేచి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల, పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మధురా నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూలో మానవ హక్కుల దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో ఓయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మానవహక్కుల విద్యార్థి జేఏసీ చైర్మన్ గడ్డం అశోక్ అధ్యక్షత వహించగా యూనివర్సిటీ ఫర్ గ్లోబల్ పీస్ యూఎస్ఏ చైర్మన్ డా.మధుకిషన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో దళితులు, ఆదివాసులు, దళిత క్రిస్టియన్స్, బహుజనులు, మైనార్టీలపై వివక్షత చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘన అంశాన్ని యూఎన్ఓలో ప్రస్తావించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం యువ న్యాయవాది ధర్మారపు శ్రీకాంత్‌కు అమెరికన్ ఎక్సలెన్స్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఐఆర్ఎస్ డా.ఉషాకిరణ్, విశ్రాంత అధ్యాపకుటు ప్రొ.గట్టు సత్యనారాయణ, ప్రొ.నతానియేలు, డా.తిరుపతయ్య పాల్గొన్నారు.


అవార్డును అందుకుంటున శ్రీకాంత్

అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణ


అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పిస్తున్న చింతల్ బస్తీ వాసులు

లాలాపేట: భారతరత్న డా. బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రతి ఆదివారం జ్ఞానమాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు, ఇందులో భాగంగానే తార్నాక చింతల్ బస్తీ నాయకులు తుంగ లక్ష్మణ్ ఆధ్వర్యంలో తార్నాక చింతల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేసి నివాళులర్పించారు. ఉన్నత చదువులతో ప్రపంచమేధావిగా గుర్తింపు పొందిన అంబేద్కర్‌ను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ప్రధానంగా దళిత,బహుజన వర్గాలు ఉన్నత విద్య అనే ఆయుధాన్ని తమ అభ్యున్నతికి ఉపయోగించుకోవాలనిసూచించారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలిపేందుకే జ్ఞానమాల కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, తదితరులున్నారు.

మాల మహానాడు నూతన కార్యవర్గం ఎన్నిక

అడ్డగుట్ట: మాల మహానాడు సికింద్రాబాద్ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఆదేశాల మేరకు నియోజకవర్గం అధ్యక్షుడిగా పాకనాటి జయకుమార్, మహిళా అధ్యక్షురాలిగా దావ రామలీల, ప్రధాన కార్యదర్శులుగా నేతి రమేష్, పుష్పలత, ఉపాధ్యక్షుడిగా తుంగ నర్సింగ్‌లతో పాటు ఇతర కమిటీ సభ్యులను నియమించారు. మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్ నూతన కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాన్ని అందజేశారు. అంబేద్కర్ అడుగు జాడల్లో నడుస్తూ సమాజానికి సేవ చేయాలని ఈ సందర్భంగా సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో గ్రేటర్ ప్రధాన కార్యదర్శి మరిపల్లి శ్రీకాంత్, కమల్‌కుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాన్ని అందుకుంటున్న నూతన కార్యవర్గ సభ్యులు

ఘనంగా శ్రీదత్తాత్రేయ జయంతి మహోత్సవాలు ప్రారంభం

సనత్‌నగర్: శ్రీహనుమాన్ దేవాలయ ప్రాంగణంలో శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయంలో శ్రీదత్తాత్రేయ జయంతి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 15 వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు ఉదయం శ్రీగణతి పూజ, కలశస్థాపన, అఖండ దీపారాధన, అభిషేకం, గురు చరిత్ర పారాయణం, సంకల్పం, అలంకారం, హారతి కార్యక్రమాలు జరిగాయి. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అలాగే ఉదయం 6 నుంచి శ్రీగణపతి పూజ, కలశస్థాపన, అఖండ దీపారాధన, అభిషేకం, శ్రీగురు చరద్ర పారాయణ సంకల్పం, అలంకారం, హారతి, ఈ నెల 14న శ్రీదత్తాత్రేయ స్వామి జన్మోత్సవం సందర్భంగా ఉదయం 6.30 గంటలకు అభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు విశేష పాదుక పూజ, సహస్ర నామ పుష్పార్చన, పల్లకీ సేవ, 15న శ్రీగురు చరిత్ర పారాయణ సాంగత, ఉదయం 9 గంటలకు దత్తహోమం, పూర్ణాహుతి, నైవేద్యం, హారతి తదితర కార్యక్రమాలు జరుగుతాయని ఈఓ సత్యనారాయణ తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీదత్తాత్రేయస్వామి..

బీసీ కులగణన సర్వే హర్షణీయం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన నిర్వహించినందుకు కాంగ్రెస్ పార్టీకి రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ తెలిపింది. ఆదివారం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా లోక్‌సభ సభ్యుడు రామకృష్ణను ఢిల్లీలోని తన నివాసంలో కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, రాష్ట్రకన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, నాయకులు వి.నాగభూషణం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న కులగణన సర్వేతో పాటు బీసీల అభివృద్ధి తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకుపోయారు. రాష్ట్రంలో గౌడలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.


ఎంపీ రాధాకృష్ణను కలిసిన గౌడ సంఘాల సమన్వయ కమిటీ నాయకులు

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..) టమాటా.27, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 20, పందిరి బీర 28, క్యాబేజీ 18, క్యారెట్ 47, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 23, బీట్‌రూట్ 41, ఉల్లిగడ్డ 50, ఆలుగడ్డ 35, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పార్కులకు బెంచీల అందజేత

సనత్‌నగర్: రోజురోజుకూ పార్కులకు వచ్చే వాకర్లు, సందర్శకులు పెరుగుతుండడంతో కూర్చోవడానికి సరిపడా బెంచీలు లేకపోవడంతో విశ్వ మానవ సంక్షేమ సంఘం ముందుకువచ్చి నాలుగు బెంచీలను అందజేసింది. జెక్‌కాలనీ మహాత్మాగాంధీ పార్కులో, కంజర్ల లక్ష్మీనారాయణయాదవ్ పార్కుల్లో రెండేసి చొప్పున బెంచీలను ఆ సంస్థ ప్రతినిధులు సమకూర్చారు. ఈ సందర్భంగా విశ్వమానవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సోమ వెంకట్ మాట్లాడుతూ పార్కుకు వచ్చే వారి సంఖ్యకు అనుగుణంగా బెంచీలు లేకపోవడంతో వాటిని సమకూర్చామన్నారు. కార్యక్రమంలో జెక్‌కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ చందు, విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పెసల మస్తాన్‌రావు పాల్గొన్నారు.

కలుషిత నీటితో ఇబ్బంది పడుతున్నాం

అడ్డగుట్ట: కలుషిత నీటి సరఫరాతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంకట్‌నగర్ వాసులు వాపోతున్నారు. అడ్డగుట్ట డివిజన్ తుకారాంగేట్ వెంకట్‌నగర్‌లో గత రెండు వారాలుగా తాగునీటిలో మురుగునీరు కలిసి పూర్తిగా కలుషిత నీరు సరఫరా అవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదంటూ స్థానికులు చెప్పుకొస్తున్నారు. ఇప్పటికైనా కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని బస్తీవాసులు కోరుతున్నారు.


కలుషిత నీటిని చూపిస్తున్న మహిళ

ప్రజావిజయోత్సవంలో అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కోట నీలిమ

సనత్‌నగర్: ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకుని సనత్‌నగర్ బస్టాండ్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ప్రజలతో పాటు బాటసారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ గడిచిన సంవత్సర కాలంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేరుస్తూ ప్రజాకర్షక పాలనను అందిస్తోందన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం రాజీపడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖమర్ హమీద్, విజయ్‌కుమార్, అడ్డూ, అతీక్ తదిరతులు పాల్గొన్నారు.

అయ్యప్ప దర్శనానికి తరలిన భక్తులు



లాలాపేట: తార్నాకకు చెందిన బిజేపి జిల్లా కార్యదర్శి మల్లికంటి అయ్యప్ప స్వామి మాల ధరించి దాదాపు 41 రోజుల నియమ నిష్టలతో దీక్షను పూర్తి చేశారు. ఈ సందర్భంగా వీరన్న ఆధ్వర్యంలో పలువురు మాలధారులు ఆదివారం అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరారు. అంతకంటే ముందుగా మాలధారులైన వీరన్న, మల్లికంటి మణికంఠ తదితరులు ఇరుముడి ధరించి ప్రత్యేక పూజలు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... మేడ్చల్- గౌడవెల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఒక వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. సుమారు 45 సంవత్సరాల వయసున్న వ్యక్తి పట్టాల వెంట నడుస్తున్న సమయంలో రైలు ఢీ కొట్టి గానీ, రైలులో ప్రయాణిస్తూ బోగీ నుంచి జారిపడి గానీ మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృత దేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

శీతాకాల సమావేశాల్లోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

లిబర్టీ: శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఒత్తిడి తేవాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి పేర్కొన్నారు. దళ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీసీ మంత్రులు, ఎంపీలు సంఘటితమై ప్రధానిని ఒప్పించి ప్రస్తుత సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించేలా చూడాలన్నారు. లేకుంటే కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు.

కరాటే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది

చిక్కడపల్లి: కరాటే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహద పడుతుందని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ తైక్వాండో ఓపెన్ చాంపియన్‌షిప్-2024 హైదరాబాద్ అధ్యక్షుడు మాస్టర్ బి.కృష్ణ ఆధ్వర్యంలో చాంపియన్‌షిప్ పోటీలు జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ జరిగాయి. వివిధ విభాగాల్లో పోటీలు జరిగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన

నల్లకుంట: టీఆర్టీ కాలనీలోని శ్రీదుర్గామాత ఆలయం పునర్ నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.